

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్!

సంగారెడ్డి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించిన ప్రైవేటు ఆస్పత్రులకు సర్కారు ఏడాదిగా బకాయిలు చెల్లించకపోవడతో రేపటి నుంచి సేవలు నిలిపి వేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు కోరుతున్నాయి. లేఖ రాసినా స్పందన లేకపోవడంతో వైద్యసేవలు నిలిపివేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. ఉమ్మడి జిల్లాలో 28 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి.

వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రారంభం

హజరైన మాదవనంద సరస్వతి స్వామి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్



మాధవానంద సరస్వతి స్వామి, బీబీపాటిల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు

అల్లాదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలిరోజు బుధవారం ఆలయ పూజారి శిలాంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో నిర్వహించిన పూజలకు భక్తులు అశేషంగా హజరయ్యారు. కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి హజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆయనకు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా తెల్లవారుజామున గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, సుదర్శన హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

- రైతు భరోసాను రూ.12 వేలకు పెంచి రైతు పక్షపాతినని నిరూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో సీఎం, మంత్రులు తీసుకున్న నిర్ణయం హర్షణీయం
- సంగారెడ్డిలో రైతు సంబురాల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేల నాయకత్వంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రులు రైతు భరోసాను రూ.12 వేలకు పెంచాలని తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రోడ్లు భవనాలశాఖ అతిథిగృహంలో బుధవారం టీజీఐఐసీ చైర్ పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మారోసారి నిరూపితమైందన్నారు. రైతు భరోసా 12 వేలకు పెంచినందుకు రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట, కంది మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, మోతీలాల్‌నాయక్, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్, నాయకులు వెంకట్, చిత్తారి యాదగిరి, కసిని రాజు, కిణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లక్ష్యం 2.73 లక్షల ఎకరాలు

సాగు 38 వేల ఎకరాలే!

- అత్యధికంగా 33,844 ఎకరాల్లో వరి నాట్లు
- మిగతా పంటలు నామమాత్రమే..
- మెదక్ జిల్లాలో జోరందుకోని యాసంగి సాగు

మెదక్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో యాసంగి పంటల సాగు ఆశించినంత వేగంగా కొనసాగడం లేదు. జిల్లాలో 2.73 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు యాసంగి పంటల సాగు ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా 2,61,165 ఎకరాల్లో వరి, మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. కానీ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా ఇప్పటివరకు 38వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారు. ఇందులో 33,844 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 2,969 ఎకరాల్లో జొన్న, 1,470 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వేసుకున్నారు.

వరి నాట్లు అంతంతే..

మెతుకు సీమగా పేరున్న జిల్లాలో అత్యధికంగా వరి సాగు చేస్తారు. మెదక్, కొల్చారం, హవేళిఘనపుర్, పాపన్నపేట తదితర మండలాల పరిధిలోని ఘణపురం ప్రాజెక్టు ఆయకట్టులో 25 వేల ఎకరాల్లో నాట్లు వేస్తారు. కౌడిపల్లి, నర్సాపూర్, శివంపేట, రామాయంపేట, నిజాంపేట, చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట, వెల్దుర్తి, మాసాయిపేట అల్లాదుర్గం మండలాల్లో కూడా బోర్లు, బావుల కింద వరి సాగుచేస్తారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 2,61,165 ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేశారు. కానీ ఇప్పటివరకు 33,844 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండడం, పది రోజులుగా చలిగాలులు వీస్తుండడం, మంచు కురుస్తుండడంతో పెద్దమొత్తంలో వరి నారు చచ్చిపోయింది. మిగిలిన నారు కూడా ఎదగ లేదు. దీంతో పుష్కలంగా నీరున్నా.. పొలాలను దమ్ము చేసి సిద్ధం చేసుకున్నా నారు లేకపోవడంతో నాట్లు వేయలేకపోతున్నారు.

ఇతర పంటలు నామమాత్రం

ఒకప్పుడు జిల్లా రైతాంగం వరి తర్వాత మొక్కజొన్న పంట అధికంగా సాగుచేసేవారు. గత ప్రభుత్వం మొక్కజొన్న సాగుపై ఆంక్షలు విధించడంతో క్రమంగా రైతులు మొక్కజొన్న వేయడం తగ్గించారు. ప్రస్తుతం నామమాత్రంగా 1,470 ఎకరాల విస్తీర్ణంలోనే మక్క సాగువేశారు. 2,969 ఎకరాల్లో జొన్నపంట వేశారు.

పండుగ తరువాత జోరు

జిల్లాలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడం, జలాశయాల్లో పుష్కలంగా నీరుండడంతో పంటల సాగు పుంజుకుంటుందని వ్యవసాయాధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ అనంతరం వరి నాట్లు జోరందుకుంటాయని, పంటల ప్రణాళిక లక్ష్యం

మిగతా 8వ పేజీలో

గండి చెరువు

ముంపు తప్పేదెలా?

- అలుగు ఎత్తు నాలుగడుగులు పెంచడంతో భారీగా నీటి నిల్వ
- ఔటర్ రోడ్డు నిర్మాణ సమయంలో అలుగు ఎత్తు పెంపు
- బ్యాక్‌వాటర్‌తో పట్టా భూముల ముంపు
- ఎగువ నుంచి చేరుతున్న పరిశ్రమల వ్యర్థాలు
- అటు కాలుష్యం.. ఇటు ముంపుతో కాజీపల్లివాసులకు ఇక్కట్లు



జిన్నారం మండలం కాజీపల్లి శివారులోని గండిచెరువు

> చెరువు అలుగు ఎత్తు పెంచడంతో నీటి నిల్వ భారీగా పెరిగి పంట భూములు మునుగుతున్నాయి. పైనుంచి చేరుతున్న రసాయన వ్యర్థాలు, డ్రైనేజీ నీటితో కాజీపల్లి గండి చెరువు కాలుష్య కాసారంగా మారింది.

జిన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి శివారు గండిగూడెం పరిధిలో ఓఆర్ఆర్ పక్కన గండి చెరువు ఉంటుంది. ఈ చెరువు అలుగు ఎత్తును రింగురోడ్డు నిర్మాణ సమయంలో నాలుగు అడుగులు పెంచారు. దీంతో, గతం కంటే నీటి నిల్వ సామర్థ్యం భారీగా పెరిగింది. గతంలో ఉన్న ఎఫ్‌టీఎల్‌ను మించి 100 ఎకరాల వరకు పట్టా భూములు నీట మునిగాయి. వర్షాకాలంలో చెరువు నీరు కాజీపల్లి గ్రామ నివాసాల సమీపం వరకు వస్తున్నాయి. కాజీపల్లి-బొల్లారం రహదారి పైకి కూడా చెరువు నీరు చేరడంతో ప్రయాణాలు ఇబ్బందిగా మారాయి.

కాలుష్య కాసారం

చెరువు పైభాగంలో ఉన్న కాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు గండిచెరువులోకి యథేచ్ఛగా చేరుతున్నాయి. చెరువు నీరు దిగువకు వెళ్లకపోవడంతో కాలుష్య కాసారంగా మారుతున్నాయి. దీనికితోడు మల్లంపేట ప్రాంతం నుంచి డ్రైనేజీ నీరు కూడా చెరువులోకి చేరుతోందని స్థానికులు తెలిపారు. కాలుష్య ప్రభావం, డ్రైనేజీ నీటి చేరికతో చెరువు కంపు కొడుతున్నదని, చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు తెలియజేశారు. మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. మూడేళ్ల క్రితం చెరువులో భారీగా చేపలు మృతి చెందడంతో పీసీబీ ఆదేశాల మేరకు పలు పరిశ్రమలు నష్టపరిహారాన్ని సైతం అందజేశాయి. చెరువు సమస్యను పరిష్కారించాలని పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, రైతులు వాపోతున్నారు. ఇటీవల కలెక్టర్‌ను, ఎంపీ రఘునందన్ రావును కలిసి ఫిర్యాదు చేయగా, ఇరిగేషన్, పీసీబీ అధికారులు చెరువును పరిశీలించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

అలుగు ఎత్తు పెంచడంతోనే సమస్య



ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలో గండిచెరువు అలుగు ఎత్తును నాలుగడుగులు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంట పొలాలు నీట మునుగుతున్నాయి. పంటలు సాగు చేయలేకపోతున్నాం. మా కుటుంబానికి 8 ఎకరాల భూమి ఉండగా.. నాలుగెకరాలు నీట మునిగింది. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేయడంతో మా భూములు ఎఫ్‌టీఎల్‌లో చేరాయి. పదేళ్ల క్రితం ఈ సమస్య లేదు. అలుగు ఎత్తును గతంలో ఉన్నంతకు తగ్గించాలి.

-పర్వేద రాజు, కాజీపల్లి

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

- మద్యం తాగించి.. గొంతు కోసి హత్య
- వీడిన ఉత్తర్‌పల్లి హత్య కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి రూరల్ పోలీసులు

7

టెర్రర్ హైవేలు

- యండేంజర్‌గా 765-డీ జాతీయ రహదారి
- గుమ్మడిదల-కొల్చారం మధ్య పలు మలుపులు
- 65వ నంబరు హైవేపై పార్కింగ్ ప్రాణసంకటం

7



నర్సాపూర్ సమీపంలో హైవే 765(డి)పై జరిగిన ప్రమాదం (ఫైల్)

ఎనిమిదో రోజు అదే ఇగం!

- మరోసారి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- కోహీర్‌లో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
- వణుకుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా

7

వైద్య సేవలు అందుతున్నాయా?

- స్టడీటూర్‌లో కేంద్ర బృందం ఆరా
- జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల పరిశీలన
- సంగారెడ్డి జీజీహెచ్, ఆరోగ్య కేంద్రాల సందర్శన
- ఎన్‌సీడీ, డయాలసిస్, టీ-హబ్ కేంద్రాల పనితీరుపై అధ్యయనం



సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఎన్‌సీడీ క్లినిక్‌లో సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు బుధవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, సబ్‌సెంటర్లను నాలుగు బృందాలు వేర్వేరుగా సందర్శించాయి. తొలుత సంగారెడ్డిలోని జీజీహెచ్‌ను నాగాలాండ్ ఎన్‌హెచ్‌ఎం ఎండీ అకుసోర్తి, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, ఎన్‌హెచ్‌ఎం డిప్యూటీ డైరెక్టర్ గిరి, ఒడిశా ఎన్‌హెచ్‌ఎం ఎండీ బృందా, మిజోరాం మిషన్ డైరెక్టర్ ఈరిక్ జోమావియా, మధ్యప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ అశిశ్ కుమార్‌లతో కూడిన పది మంది బృందం సందర్శించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ క్లినిక్‌కు నిత్యం బీపీ, షుగర్ బాధితులు ఎంత మంది వస్తున్నారు, మందులు ఎన్ని రోజులకు ఇస్తున్నారు, కౌన్సిలింగ్ ఇస్తున్నారా? ఫాలోఅప్ చేస్తున్నారా? ఫిజిషియన్ రోగులను చూస్తున్నారా? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డయాలసిస్ సెంటర్‌లో పేషెంట్లకు అందిస్తున్న వైద్యసేవలు, టి-డయాగ్నోస్టిక్ హబ్‌లో పేషెంట్ల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు టెలిమెడిసిన్, పాలియేటివ్ కేర్, రేడియాలజీ ల్యాబ్ తదితర విభాగాలను కలియ తిరిగి సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ నేషనల్ వర్క్‌షాప్‌లో భాగంగా స్టడీటూర్ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఆయా ఆస్పత్రులను సందర్శించినట్టు బృందం సభ్యులు తెలిపారు. కొండాపూర్ పీహెచ్‌సీ, మల్లెపల్లి సబ్‌సెంటర్, తెల్లాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, ఆర్సీపురం

మిగతా 8వ పేజీలో

జాబ్‌మేళాతో దివ్యాంగులకు ఉద్యోగాలు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించేందుకే జిల్లా ఉపాధి కల్పనశాఖ, మహిళా శిశు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖలె సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించినట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళాను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌మేళాకు సుమారు 156 మంది దివ్యాంగులు హాజరయ్యారని, ఎనిమిది మందికి నియామకపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి అనిల్ కుమార్, వివిధశాఖల అధికారులు, యూత్ ఫర్ జాబ్స్ మేనేజర్ అశ్విన్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన దివ్యాంగులు





వెపన్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న డీజీ అభిలాష బిస్త్

సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు బేష్

- డీజీ అభిలాష బిస్త్

సంగారెడ్డి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందని డీజీ అభిలాష బిస్త్ కితాబిచ్చారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మల్టీజోన్ ఐజీ వి.సత్యనారాయణ, సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది పరేడ్, టర్న్ అవుట్, మాబ్‌డ్రిల్ డ్రిల్, వెపన్ డ్రిల్ తనిఖీ చేశారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం, ఆయుధగారాన్ని, మోటార్ వెహికిల్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది బిల్లులు ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సిబ్బంది సర్వీస్‌బుక్, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నిర్వహణ, సరెండర్ లీవులు, క్రమం తప్పకుండా వచ్చేవిధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి గత సంవత్సరం జరిగిన నేరాల వివరాలు, జిల్లా పోలీసులు తీసుకున్న చర్యలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటు చేసిన టి.న్యాబ్, ట్రాఫిక్ రద్దీ నివారణకు తీసుకున్న చర్యల గురించి జిల్లా ఎస్పీ రూపేష్ డీజీకి వివరించారు. సిబ్బంది కొరత ఉన్నా జిల్లా యంత్రాంగం మంచి ఫలితాలను తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు తమకు కేటాయించిన విధులను పూర్తి నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఒక్కరు తప్పు చేసినా మొత్తం పోలీసుశాఖకు చెడ్డపేరు వస్తుందన్నారు. సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్టీజోన్ ఐజీ వి.సత్యనారాయణ, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఏవో కల్యాణి, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటేెడ్డి తదితరులు పాల్గొన్నారు.







స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి


జంగిటి లచ్చవ్వ

ధూళిమిట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన ధీర వనిత జంగిటి లచ్చవ్వ(90) బుధవారం అనారోగ్య, వృద్ధాప్య కారణాలతో మృతి చెందింది. గ్రామస్థులు జంగిటి లచ్చవ్వ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా సుమలత


చెరుకు సుమలత

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన చెరుకు సుమలత నియామకమయ్యారు. ఈమేరకు బుధవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదులో ప్రత్యేక కృషి చేసినందుకు చెరుకు సుమలతకు కమిటీలో ప్రాధాన్యం కల్పించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'యంగ్ లీడర్స్ డైలాగ్స్'కు గాజులపల్లి యువకుడి ఎంపిక


గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మతో ఎంపికై యువత

దౌల్తాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యంగ్ లీడర్స్ డైలాగ్స్‌కు సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు మహమ్మద్ షాదుల్లా ఎంపికయ్యారు. నేషనల్ యూత్ డేను పురస్కరించుకుని న్యూఢిల్లీలో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించే యూత్ ఫెస్టివల్‌లో మహమ్మద్ షాదుల్లా పాల్గొని హం పడే దేశ పడే అనే కొత్త పథకంతో భావితరాల భవిష్యత్తు బడి ప్రదర్శించి తన ఆలోచనలను వ్యక్తపరచనున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం తరఫున వీక్షిత్ భారత్ కోసం ఎంపికైన వారిని మంగళవారం గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ అభినందించారు.


రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పుల్‌కల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో నేటి నుంచి నిర్వహించనున్న 57వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రమైన చౌటకూర్ జిల్లా పరిషతు ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖోఖో అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో 15 మంది క్రీడాకారులకు వారం రోజులుగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఖోఖో సీనియర్ క్రీడాకారుడు కలాలి నాగాగౌడ్ పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారుల శిక్షణ శిబిరం బుధవారంతో ముగియగా వారు రాష్ట్రస్థాయి క్రీడలకు తరలివెళ్లారు. చౌటకూర్‌కు చెందిన క్రీడాకారులు 9 మంది కాగ, మిగిలిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. భారీ ఎత్తున రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మాటు వేసి లారీలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 250 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



క్రైం కార్నర్

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

● ఉత్తర్‌పల్లి హత్య కేసు ఛేదన
● వివరాలు వెల్లడించిన సంగారెడ్డి రూరల్ పోలీసులు


మాందాపూర్ రాజు (ఫైల్)

కంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత నెల 30న సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఉత్తర్‌పల్లి గ్రామ శివారులో సంగారెడ్డి పట్టణానికి చెందిన మాందాపూర్ రాజుని ఎవరో గుర్తుతెలియని వ్యక్తుల గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి బుధవారం కేసు వివరాలను తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని ఎస్‌ఐజీ కాలనీలో నివాసం ఉంటున్న మాందాపూర్ రాజు(35) పదేళ్ల క్రితం వరంగల్ నుంచి సంగారెడ్డికి వలసవచ్చాడు. అతని భార్య సుమలత (32) తమ ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. భార్యభర్తలు ఇద్దరు కొండాపూర్ మండల పరిధిలోని ఓ ప్రైవేటు పరిశ్రమ క్యాంటీన్లో పని చేసేవారు. అదే క్యాంటీన్లో వంట మాస్టర్‌గా ఉన్న రామస్వామి(38)తో సుమలతకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. వీరిద్దరి వివాహేతర సంబంధం విషయం సుమలత భర్త రాజుకు తెలిసింది. దీంతో తమకు అడ్డుగా ఉన్నాడని భావించి రాజుని హత్య చేసేందుకు కుట్రపన్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సుమలత, రామస్వామి రాజుకు మద్యం తాగుదామని ఆశ చూపించి డిసెంబరు 29న రాత్రి కంది మండలం ఉత్తర్‌పల్లి గ్రామ శివారులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ రాజుకి ఫుల్లుగా మద్యం తాగించారు. అతడు మత్తులోకి జారుకున్నాకా తమ వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారే ఈ హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితుడైన రామస్వామి కంది మండలం కవలంపేట గ్రామానికి చెందినవాడు కాగా, అతడికి భార్య ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రామాయంపేట మండలం డి.ధర్మారంలో వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కని ఎల్లవ్వ(65) బుధవారం ఉదయం లేచేసరికి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబీకులు ఇరుగుపొరుగు, బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు చెరువు వద్ద ఆమె ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు గజ ఈతగాళ్లను దింపి మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం శవాన్ని రామాయంపేట మార్చురీకి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోతానంటూ ఫోన్..
కొడుకును వెతికే ప్రయత్నంలో

రైలు ఢీకొని తండ్రి మృతి


రంగయ్యాగారి పెద్దనర్సింలు (ఫైల్)

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఊర్లో జరిగిన ఓ గొడవతో మనస్తాపానికి గురై.. తాను చనిపోతున్నట్లు ఫోన్ రాగా.. కొడుకును వెతికే ప్రయత్నంలో తండ్రి రైలు ప్రమాదానికి గురై ప్రాణాలొదిలాడు. ఈ ఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం బాగిర్తిపల్లికి చెందిన రంగయ్యాగారి పెద్ద నర్సింలు(55) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాత్రిపూట కొడుకు ఫోన్ కాల్ వచ్చింది. తాను సూసైడ్ చేసుకుంటున్నట్లు తెలపడంతో నర్సింలు భిక్కనూర్ పోలీసులకు సమాచారం అందజేసి కొడుకు మొబైల్ నంబర్ ఇచ్చాడు. వెంటనే పోలీసులు మొబైల్ ట్రాక్ చేసి రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ సమీపంలో అతడిని గుర్తించి కాపాడారు. ఈ విషయం తెలియని తండ్రితో పాటు కుటుంబీకులు లింగాపూర్, అక్కన్నపేట ప్రాంతాల్లో వెతికే క్రమంలో అర్ధరాత్రి వేళ హైదరాబాద్ వెళ్తున్న ఓ రైలుకు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. ఓ వైపు భార్య, మరో ఇద్దరు అక్కడే ఉన్నప్పటికీ వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గుర్తుతెలియని వాహనం

ఢీకొని ఒకరి మృతి

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన బుధవారం రాత్రి రామాయంపేట మండలం అక్కన్నపేట శివారులో జరిగింది. కామారెడ్డి జిల్లా రథాల రామారెడ్డి గ్రామానికి చెందిన దండబోయిన నారాయణ(59) అక్కన్నపేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటు వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం నడుపుతూ బలంగా ఢీకొట్టి పారిపోయాడు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్ఐ బాల్‌రాజ్ ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెర్రర్ హైవేలు


765డి జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపు

యమడేంజర్‌గా 765డి జాతీయ రహదారి

గుమ్మడిదల నుంచి కొల్చారం వరకు అనేక మలుపులు

డివైడర్ లేక మరింత ప్రమాదకరం

హైదరాబాద్ - మెదక్ హైవేపై ప్రయాణించేందుకు బెంబేలు

నర్సాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఈహైవేను విస్తరించినప్పటి నుంచి వాహన రాకపోకలు పెరగగా, అదేస్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకుంటూ యమడేంజర్‌గా మారింది. ముఖ్యంగా కొల్చారం - గుమ్మడిదల మధ్య ఉన్న మూలమలపులు ప్రాణాంతకంగా మారాయి. ఎంతో మంది దుర్మరణం పాలవుతున్నా హైవే అథారిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

17 కిలోమీటర్లే ఫోర్ లేన్

మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ ఔటర్ రింగురోడ్డు నుంచి నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం మీదుగా మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు 62 కిలోమీటర్లు రోడ్డును ఆరేళ్ల క్రితం జాతీయయ రహదారిగా రూ.435 కోట్లతో విస్తరించారు. అయితే ఓఆర్ఆర్ నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు కేవలం 17 కిలోమీటర్లు మాత్రమే నాల్లు లేన్లుగా, ఇరువైపుల 50 అడుగుల మేర విస్తరించారు. గుమ్మడిదల అటవీ ప్రాంతం నుంచి మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు మిగతా 45 కిలోమీటర్ల రోడ్డును మాత్రం అటవీ ప్రాంతం ఉందన్న ఉద్దేశంతో కేవలం పది మీటర్లు మాత్రమే విస్తరించి మూడు లేన్ రోడ్డుగా మార్చారు. పైగా మలుపులు కూడా అలాగే వదిలేశారు. జాతీయ రహదారి కావడంతో రోడ్డు సాఫీగా ఉండటంతో వాహనదారులు వేగంగా వెళుతుండడంతో మలుపుల వద్ద అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాటిని ఢీకొంటున్నారు. ఇలాంటి ప్రమాదాలే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పైగా ఈ జాతీయ రహదారిపై డివైడర్ కూడా కేవలం గండిమైసమ్మ నుంచి గుమ్మడిదల వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత గ్రామాలు ఉన్న చోట మాత్రమే డివైడర్‌ను నిర్మించి మిగతాదంతా వదిలేశారు. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో డివైడర్ లేక ఎదురుగా వచ్చే వాహనాలపైకి దూసుకెళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాద మలుపులు ఇవే

గుమ్మడిదల అటవీ ప్రాంతంలోని నలవల్లి మేడాలమ్మ ప్రాంతం, వ్యవసాయ పరిశోధన కేంద్రం వై జంక్షన్, అర్బన్ పార్కు, సబ్‌స్టేషన్, సీతారాంపూర్, చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, కౌడిపల్లి మండలంలో లోతువాగు, దేవులాతండా, వెంకట్రావ్‌పేట, రాయిలాపూర్, నాగ్సన్‌పల్లి, అంతారం, మహ్మద్‌నగర్, కౌడిపల్లి, కొల్చారం మండలంలో హనుమాన్‌బండల్, కిష్టాపూర్ తదితర గ్రామాల వద్ద మలుపులు ఉండటంతో ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయి. ఓవైపు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న ప్రస్తుత తరుణంలో మెదక్ - హైదరాబాద్ హైవేపై ప్రమాదాల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాల రోడ్డుకు టోల్‌చార్జీ

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 765డి హైవే ప్రారంభమవుతున్నది. అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు 17 కిలోమీటర్ల మేర మాత్రమే నాలుగు లేన్‌లుగా ఉంటుంది. కానీ ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే మాత్రం టోల్ కట్టి తీరాల్సిందే. మెదక్ వైపు నుంచి వచ్చే వారికి గుమ్మడిదల సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు వద్ద చార్జీ వసూలు చేయడం పట్ల సర్వత్రా అభ్యంతరాలు వస్తున్నాయి. నాలుగు లేన్‌లు రోడ్డు ఉండే ప్రాంతాలైన ఓఆర్ఆర్ నుంచి గుమ్మడిదల వరకు మాత్రం టోల్‌చార్జీ లేదు. ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మెదక్, నర్సాపూర్ వారికి మాత్రం ముక్కుపిండి టోల్‌చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. నర్సాపూర్ ప్రాంతవాసులకు 20 కిలోమీటర్లలోపే ఉన్నా టోల్ వసూలు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఏడాదిలో వందమంది మృత్యువాత

జాతీయ రహదారిపై గతేడాది చోటుచేసుకున్న ప్రమాదాల్లో వందమంది వరకు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా మరెందరో క్షతగాత్రులయ్యారు. జాతీయ రహదారిపై గుమ్మడిదల మండల అటవీ ప్రాంతంలో 25 ప్రమాదాలు జరగ్గా 9 మంది చనిపోయారు. మూడురోజుల క్రితమే నల్లవల్లి సమీపంలోని మేడాలమ్మ మలుపువద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, వారి కుటుంబాలనే కాకుండా.. ఈ రోడ్డుగుండా ప్రయాణించే వారందరినీ కలిచివేసింది. ఇక నర్సాపూర్ పరిధిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి రెడ్డిపల్లి వరకు ఆరుగురు చనిపోయారు. కాగా కౌడిపల్లి, కొల్చారం మండలాల పరిధిలో అత్యధికంగా మరణాలు సంభవించాయి. కౌడిపల్లి మండలంలో 26 మంది చనిపోగా కొల్చారం మండలంలో 17 మంది వరకు మృతి చెందారు.


కౌడపల్లి మండల పరిధిలో జరిగి ప్రమాదం(ఫైల్)

పార్కింగ్ ప్రాణసంకటం


హైవే 65పై తరచూ ప్రమాదాలు జరుగుతున్న చౌరస్తా

జహీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : 65వ నంబర్ జాతీయరహదారి ప్రమాదభరితంగా మారుతోంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం కొత్తూర్(డి) మొదలుకుని మొగుడంపల్లి మండలం మాడ్గి చౌరస్తా వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర జహీరాబాద్ మీదుగా 65వ నంబరు జాతీయరహదారి విస్తరించి ఉంది. నాలుగు లేన్‌ల రోడ్డు ఉన్నప్పటికీ అతివేగంగా వచ్చే వాహనదారులకు చౌరస్తాలు, డైవర్షన్ పాయింట్‌లు, రోడ్డు పక్కన పార్కింగ్ ప్రాణసంకటంగా మారుతున్నది.

రోడ్ల పక్కనే అడ్డదిడ్డంగా పార్కింగ్

జహీరాబాద్ మీదుగా ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీంతో కొందరు ప్రధాన చౌరాస్తాలను వ్యాపార కేంద్రాలుగా మార్చుకున్నారు. హైవే పొడవునా రోడ్డును ఆనుకుని అనేక మంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి వచ్చే వారు రోడ్డు పక్కనే ఇష్టారీతిగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడం ప్రమాదాలకు కారణమవుతోంది.

బ్లాక్‌స్పాట్లు ఇవే..

కొత్తూర్(డి), చింతలగట్టుచౌరస్తా, దిగ్వాల్, రాయిపల్లి(డి), హుగ్గెల్లి చౌరస్తా, జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్, అల్గోల్ చౌరస్తా, బూడ్దిపాడ్, సత్వార్, అసద్‌గంజ్ చౌరస్తాలను అధికారులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. ఈ చౌరస్తాల వద్ద వాహన దారులకు వేగనియంత్రణను కట్టడి చేస్తే కొంత మేరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాత్రివేళల్లోనైతే ఆయా చౌరస్తాల వద్ద లైట్లు ఉండవు. సంకేత సూచికలు సరిగ్గా లేవు. రేడియం స్టిక్కర్లు పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో జీబ్రాలైన్స్ ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో అసలే లేవు.

మూడేళ్లల్లో 180 మంది దుర్మరణం

జహీరాబాద్ డివిజన్‌లో మూడేళ్లల్లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 180 మంది మృతిచెందగా 149 మంది గాయాలపాలయ్యారు. 2022లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో 65 మంది మృతిచెందగా, 75 మందికి గాయాలయ్యాయి. 2023లో 63 మంది మృతిచెందగా, 35 మంది గాయాలపాలయ్యారు. 2024లో 52 మంది మృతిచెందగా, 39 మంది క్షతగాత్రులయ్యారు.


జహీరాబాద్ బైపాస్ రోడ్డు పక్కన నిలిపిన లారీలు

ఎనిమిదో రోజు అదే ఇగం!

● కోహీర్‌లో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత
● వణుకుతున్న ఉమ్మడి జిల్లా

కోహీర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో వరుసగా ఎనిమిదో రోజు చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. ఈ సీజన్‌లోనే రికార్డుస్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం కూడా సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. కోహీర్‌లో 8.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తం చలి తీవ్రత తగ్గడం లేదు.

సంగారెడ్డి జిల్లాలో.. న్యాల్‌కల్‌లో 10.7, మలచెల్మలో 10.8, అల్గోల్‌లో 11.0, సత్వార్‌లో 11.1 మొగుడంపల్లిలో 11.3, ఝరాసంఘంలో 11.5, నల్లవల్లిలో 11.5, జహీరాబాద్‌లో 11.8, దిగ్వాల్ 11.9, ఆర్‌సిపురంలో 12.1, కంకోల్‌లో 12.2, లక్ష్మీసాగర్‌లో 12.3, ఆల్మాయిపేట్‌లో 12.4, కందిలో 12.6, పుల్కల్‌లో 12.8, కడ్పల్‌లో 12.8, సింగూర్‌లో 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

మెదక్ జిల్లాలో.. మనోహరాబాద్‌లో 12.4, శివ్వంపేటలో 12.7, బోడగట్(ఈఎస్ఎస్)లో 12.9, చిప్పల్‌తుర్తి 12.9, శంకరంపేట్(ఎ)లో 12.9, డిగ్రీలు.

సిద్దిపేట జిల్లాలో.. అంగడికిష్టాపూర్‌లో 12.2, మిర్‌దొడ్డిలో 12.7, ములుగులో 12.8, కొండపాకలో 12.9, చిట్యాలలో 12.9 డిగ్రీలుగా నమోదైంది.



ఆలయ భూముల్లో

త్వరలో సోలార్ యూనిట్

● వంద ఎకరాలను లీజుకు తీసుకున్నాం
● డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన వంద ఎకరాల్లో త్వరలో సోలార్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం నర్సాపూర్ - మెదక్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయ భూమిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఆలయ భూమని వినియోగంలోకి తేవాలనే ఉద్దేశంతో లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్న సందర్భంగా మెదక్ జిల్లాలోనూ ఏర్పాటు చేసేందుకు ఆలయానికి చెందిన వంద ఎకరాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇక్కడ 25 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ఎస్ఈ శంకర్, డీఈఈ చాంద్‌భాషా, ఏడీఈ రమణారెడ్డి, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఆలయ ఈవో శ్రీనివాస్, ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతా

● విద్యాసంస్థలను సేవా దృక్పథంతో కొనసాగించాలి
● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్

పటాన్‌చెరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని, సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుధవారం పటాన్‌చెరు శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 60శాతం పాఠశాల విద్యను అందిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. విద్యను వ్యాపారాత్మకంగా కాకుండా సేవా దృక్పథంతో కొనసాగించాలన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తేనే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా మారుతారని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు, తద్వారా సమాజ శ్రేయస్సును కాపాడటంలో ప్రైవేటు యాజమాన్యాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ముఖ్య సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిని అందించడంలో సైతం ప్రైవేటు విద్యాలయాలు ఎంతో కీలకంగా పనిచేస్తున్నాయని, టీచర్లు, ఇతర సిబ్బంది, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు వారి సమస్యలను సైతం పరిష్కరించేందుకు సహకరిస్తామన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రమేష్‌రావు, కోశాధికారి రాఘవేంధర్‌రెడ్డి, నాయకులు విలియంజేమ్స్, ప్రభాకర్‌రెడ్డి, సాయితేజ, ఉమామహేశ్వరావు, మహ్మద్ ఇస్తియాజ్‌గుల్షన్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంధర్‌రెడ్డి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సంగారెడ్డి సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయాధికారి

సంగారెడ్డి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ బుధవారం సందర్శించారు. జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్‌రూమ్ పరిశీలించారు. జైలు ఆవరణ అంతా తిరిగి ఖైదీలతో మాట్లాడారు. జైలులో సదుపాయాలు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాల అందేలా చూడాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని తాము నియమిస్తామని ఖైదీలకు న్యాయాధికారి తెలియజేశారు.


ఖైదీలుకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి రమేష్

ఉత్సాహంగా

క్రికెట్ టోర్నమెంట్

జహీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఖిజార్‌యా అంతర్‌రాష్ట్ర గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతుంది. ఐదు రోజులుగా నిర్వహించిన మ్యాచ్‌ల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 జట్లు పాల్గొన్నాయి. గ్రూపు దశలో నేషనల్‌ఖీం ఎలెవన్, మాక్‌బళ్లారీ, డాలీసీసీ అచ్చంపేట, రాయల్‌కార్ట్, సేవాలాల్ జట్లు విజయం సాధించాయి.

ముత్తంగిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

● రెస్టారెంట్, టిఫిన్ సెంటర్‌కు నోటీసుల జారీ


రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన వంటకాలను పారబోయిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సంగారెడ్డి అర్బన్/పటాన్‌చెరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధి ముత్తంగిలోని పలు రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం దాడులు చేశారు. స్వీట్‌హాట్ రెస్టారెంట్‌తో పాటు హరిదోశ టిఫిన్ సెంటర్లలో విస్తృత తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. ముందుగా స్వీట్‌హాట్ రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన ఫ్రై చికెన్, ఇతరత్రా ఆహార పదార్థాలను పారవేయించారు. నాణ్యత, పరిశుభ్రత మెరుగుపర్చుకోవాలని నోటీసులు జారీ చేశారు. పప్పు, టామోటా సాస్‌ల శాంపిళ్లను సేకరించారు. ఆ తర్వాత హరి దోశ టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రూ.3 వేల విలువైన కలర్ టీ పౌడర్‌ను పారబోశారు. అల్లం వెల్లుల్లి శాంపిళ్లను సేకరించి నాణ్యత, పరిశుభ్రత మెరుగుపర్చుకోవాలని నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ మాట్లాడుతూ ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచకూడదని, ఆహార భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సేకరించిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తామని వచ్చిన ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలుంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీశిక, రాజేశ్వర్, ఫుడ్ టెక్నాలజిస్ట్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈ అంటూ లైన్‌మన్‌కు బెదిరింపులు

● మీటర్ ఇప్పిస్తానని వినియోగదారుల నుంచి డబ్బు వసూలుకు ప్రయత్నం
● సామ్యాతండాకు చెందిన కాట్రోత్ సురేష్‌గా గుర్తింపు.. కేసు నమోదు


కాట్రోత్ సురేష్

శివ్వంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ ఏఈ అని చెప్పి లైన్‌మన్‌ను బెదిరించడమే కాకుండా, తక్కువకే మీటర్లు ఇప్పిస్తానని నమ్మబలికి వసూళ్లకు పాల్పడిన దుండగుని విద్యుత్ శాఖ సిబ్బంది పోలీసులకు అప్పగించిన సంఘటన లింగోజిగూడలో బుధవారం చోటుచేసుకున్నది. లైన్‌మన్ సురేష్, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిల్లుట్ల, కొత్తపేట, రత్నాపూర్ లింగోజిగూడ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న గోదూరి సురేష్‌కు ఈనెల 5న గుర్తుతెలియని వ్యక్తి 500 కేవీ ఏఈని మాట్లాడుతున్నానని, ప్రజలు వితౌట్ మీటర్‌తో డొమెస్టిక్ విద్యుత్ వాడుతుంటే ఏం చేస్తున్నావంటూ బెదిరించగా ఫేక్‌కాల్ అని భావించి పట్టించుకోలేదు. కాగా, బుధవారం లింగోజిగూడలో పారిశుధ్య కార్మికుడైన దాసరి భిక్షపతి దగ్గరికి వచ్చి మీటర్ లేని వారికి రూ.250కే మీటర్ ఇస్తున్నామని డబ్బు కట్టమని చెప్పడంతో భిక్షపతి లైన్‌మన్‌కు సమాచారం అందించారు. లైన్‌మన్ సురేష్ వెంటనే అక్కడికి వెళ్లగా ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తి, ఇతడు ఒకరే అని తెలిసింది. మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధిలో సామ్యాతండాకు చెందిన కాట్రోత్ సురేష్‌గా గుర్తించారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు కాట్రోత్ సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. కాట్రోత్ సురేష్ గతంలోనూ పలు గ్రామాల్లో వసూళ్లకు, అక్రమాలకు పాల్పడ్డట్లు తెలిసింది.

న్యూస్ బాక్స్

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

నారాయణఖేడ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి, బోధన తీరును తెలుసుకున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జోగిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అందోలులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశం పొందగోరే అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ లింగారెడ్డి తెలిపారు. గతనెల 21న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ.. (వచ్చే నెల) ఫిబ్రవరి 1 వరకూ కొనసాగుతుందన్నారు. రూ.100 రుసుము చెల్లించి, ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చైనా మాంజా అమ్ముతున్న ఆరుగురిపై కేసు

జిన్నారం/పటాన్‌చెరు, జనవరి, 8 (ఆంధ్రజ్యోతి): గాలిపటాల కోసం ప్రమాదకరమైన మాంజా దారం అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. బొల్లారంలో వ్యాపారులు లక్ష్మణ్, అరుణ్‌కుమార్, పూజాదేవిల తమ షాపుల్లో నిషేధిత మాంజా అమ్మకాలు సాగిస్తుండగా దాడులు జరిపి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీమైదానం పక్కనే చైనా మాంజా షాపు పెట్టి విక్రయిస్తున్న ఎండీ.అన్సారీగోరీ, సాయిరాం కాలనీలోని కిరాణాషాపు యజమాని గుజ్జరి రజని, గొల్లబస్తీకి చెందిన ప్రశాంత్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

మనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంధుల కోసం ప్రత్యేకంగా అక్షరాలను కనుగొన్న లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని మండల కేంద్రమైన ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

రింగ్‌రోడ్డుతో ప్రయోజనాలు

నారాయణఖేడ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ నిర్మిస్తున్న రింగ్‌రోడ్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. రింగ్‌రోడ్డులో భాగంగా వేంకటేశ్వరాలయం నుంచి డీఎస్పీ కార్యాలయ సమీపంలోని నిజాంపేట-ఖేడ్-బీదర్ జాతీయ రహదారి వరకు కొనసాగుతున్న పనులను బుధవారం ఆయన భూములు కోల్పోతున్న, చుట్టుపక్కల భూముల రైతులతో కలిసి పర్యవేక్షించారు.

సృజనాత్మకతతో కూడిన బోధన చేయాలి: ఎంఈవో

కోహీర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన చేయాలని ఎంఈవో జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పైడిగుమ్మల్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేగోడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మోడల్ పాఠశాలలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రేగోడు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ బుధవారం తెలిపారు. ఆరవ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం 132కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర నిర్వహణ కొనసాగుతున్నందున బుధవారం అమీన్‌పూర్, పటేల్‌గూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ మొత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు వెంకట్‌రెరాంరెడ్డి, రామకృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని అమీన్‌పూర్, ఇసుకబావి, బీరంగూడ, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా, బంధంకొమ్ము, నర్రెగూడెం గ్రామాల పరిధిలోని కాలనీల్లో కూడా విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్ బాధ్యతల స్వీకరణ

పటాన్‌చెరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నాగరాజు చార్మినార్‌జోన్‌కు బదిలీపై వెళ్లారు. నరేష్ మహబూబ్‌నగర్ నుంచి అమీన్‌పూర్‌కు బదిలీ అయ్యారు.

'ఎరువుల కొరత ఉండొద్దు'

చిలప్‌చెడ్: యాసంగిలో రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని ఏవో రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్లు పరిశీలించారు.

ప్రజారోగ్యంపై ఆరోగ్యశాఖ చర్యలు హర్షణీయం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ముప్పారం గ్రామంలో టీబీ సభ్యుల బృందం పర్యటన


మెదక్ జిల్లా ఆస్పత్రిలో టీబీ నాట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న టీబీ బృందం

అల్లాదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంపై వైద్య ఆరోగ్యశాఖ తీసుకున్న చర్యలు హర్షణీయమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ టీబీ సభ్యుల బృందానికి కితాబునిచ్చారు. అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామంలో నిర్వహిస్తున్న నిక్షయ్ శిబిరాన్ని బుధవారం టీబీ సభ్యుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు టీబీపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్‌తో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టీబీ నియంత్రణకు విశేష కృషి చేస్తున్నారని, అదేవిధంగా ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా డెంగీ, మలేరియా నివారణకు ఆరోగ్యశాఖ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం జాతీయ టీబీ సభ్యుల బృందం మెదక్ జిల్లా ఆస్పత్రిలో టీబీ నాట్ సెంటర్‌ను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో జాతీయ టీబీ బృందం డాక్టర్ సంజీవ్‌చౌహాన్, అభిషేక్, విష్ణు, రాజేశ్వరి, జిల్లా టీబీ అధికారి నవీన్‌కుమార్, అల్లాదుర్గం వైద్యాధికారి సారిక పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మెదక్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా బుధవారం సంచార చేపల విక్రయ వాహనాన్ని మహిళా సంఘం గ్రూప్ సభ్యురాలు కల్యాణికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు ఇందిర శక్తి పథకంలో మీసేవ, పౌల్ట్రీ, నాటుకోళ్ల పెంపకం, క్యాంటీన్లు, ఇతర 20 రకాల యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న కొత్త రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్ మున్సిపాలిటీల పరిధిలో శాశ్వత నీటి ఎద్దడి నివారణ కోసం నిర్మిస్తున్న రిజర్వాయర్ల నుంచి ఈ నెల 20న మంచినీటిని విడుదల చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్లు, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారంగా బొల్లారంలో రెండు మిలియన్ల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు భారీ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ లాలాబాయికాలనీ, పటేల్‌గూడ, బంధంకొమ్ములో రిజర్వాయర్ల నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. రెండు మున్సిపాలిటీల్లోని ఐదు రిజర్వాయర్లను 20న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పైపులైన్ల ఆధునీకరణ కోసం మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా రూ.5.40 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూంల టౌన్‌షిప్‌లో 1500 మంది నివసిస్తున్నందున వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన రిజర్వాయర్ల నిర్మాణానికి అనువైన స్థలాలను అన్వేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్టులు శ్రీధర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహగౌడ్, తెల్లాపూర్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, జలమండలి మేనేజర్ సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డీజీఎంలు చంద్రశేఖర్, శివ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం: మెదక్ ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపడుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో రెండురోజుల పాటు జరగనున్న పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించి మాట్లాడారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమన్నారు. 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసికోల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం, రిలే, టగ్ ఆఫ్‌వార్, డిస్క్‌త్రో, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర పోలీస్‌మీట్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్‌డీఎస్పీ రంగనాయక్, సీఐ, ఆర్ఐ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థులకు ప్రయోజనం


- సంగారెడ్డి ఫల పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర



రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సుచిత్ర

జహీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటించి నేర్చుకుంటేనే మరింత ప్రయోజనం ఉంటుందని సంగారెడ్డి ఫల పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలో రైతుసదస్సు నిర్వహించారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో చదివిన దానికంటే, క్షేత్రస్థాయిలో రైతులతో భాగస్వామ్యమై నేర్చుకున్న దాంట్లోనే అనుభవం ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు, మూడునెలల పాటు నేర్చుకున్న అనుభవాల వివరణ తదితరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ, హరికాంత్, మౌనిక, ఏవోలు లావణ్య, నవీన్, ఏఈవో ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

నిమ్జ్ రైతులకు, కూలీలకు పునరావాసం కల్పించాలి: సీపీఎం


ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నిమ్జ్ భూ బాధిత రైతులు, నాయకులు

జహీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నిమ్జ్ పరిధిలోని కూలీలకు, భూములు ఇచ్చిన రైతులకు పునరావాసం కల్పించాలని సీపీఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో, నిమ్జ్ కార్యాలయం ఎదుట రైతులు, నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

అమీన్‌పూర్ అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకరిస్తా

- ఎంపీ రఘునందన్‌రావు భరోసా


రఘునందన్‌రావుకు మొక్క అందజేస్తున్న పాండురంగారెడ్డి

పటాన్‌చెరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకరిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హామీఇచ్చారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ జగదీష్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్‌లో మౌలిక వసతులను అదేస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న జనావాసాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, నాణ్యమైన విద్యుత్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మౌలిక సమస్యల పరిష్కారానికి ఎంపీ నిధులు కేటాయించాలని, త్వరలో నిర్వహించే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరు కావాలని పాండురంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


కౌడిపల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్న కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

కౌడిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొంత కాలంగా గ్రంథాలయ భవనంలో కొనసాగుతున్న పంచాయతీ రాజ్ భవనాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేసి ఉద్యోగాలు సాధించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయ సెక్రటరీ, వంశీకృష్ణ ఉన్నారు.

బీవీఆర్ఐటీలో కాంక్రీట్ కానో పోటీలు

నర్సాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కాంక్రీట్ కానో పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 16 ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటనున్నారు. పోటీల్లో కాంక్రీట్ సిమెంట్ పడవల నిర్మాణం, డిజైన్, నిర్మాణ నాణ్యత, వాటర్ రేస్ పనితీరు బరువు, బలం మొదలైన టెక్నికల్ ప్రామాణికతో పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, హెచ్‌వోడీ కృష్ణారావు, డీజీఎం కాంతారావు, మేనేజర్లు బాపిరాజు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పటాన్‌చెరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాడుతున్న మొత్తం 13 మందిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మండల పరిధిలోని ముత్తంగిలో ఓ ఇంట్లో పేకాడుతున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.35,500 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రేశం గ్రామంలోని ఖాళీ ప్లాటులో పేకాడుతున్న మరో ఐదుగురిని అరెస్ట్ చేసి.. రూ.7,250 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రైవేట్ వెంచర్ కోసం ప్రభుత్వ భూమిలో రోడ్డు


వావిలాల శివారులో ప్రభుత్వ స్థలం నుంచి ఏర్పాటు చేస్తున్న రోడ్డు

జిన్నారం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వెంచర్ కోసం విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి 40 అడుగుల మేర రహదారి పనులు చేపట్టారు. జిన్నారం మండలం వావిలాల పరిధిలోని 189/77 సర్వే నెంబరులో 5.13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ స్థలానికి పక్కనే ప్రైవేట్ వ్యక్తులు ఇటీవల వెంచర్ ఏర్పాటుకు పనులు చేపట్టారు. కాగా వెంచర్‌లోకి వెళ్లేందుకు వావిలాల, గాగిల్లాపూర్ ప్రధాన రహదారి నుంచి 40 అడుగుల మేర ప్రభుత్వ స్థలం నుంచి పనులు చేపట్టారు. రోడ్డు కోసం తవ్వకాలు జరిపి కంకర వేసి కబ్జాకు తెరతీశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ఎకరం విలువ రూ.8 కోట్ల వరకు ఉండగా.. రోడ్డు కోసం ఆక్రమించిన స్థలం విలువ కోట్లలో ఉంటుందని, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని స్థానికులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా పనులు నిలిపి వేశామని ఆక్రమణలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

- పార్టీ ఆఫీస్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకూ ర్యాలీ
- అంబేడ్కర్ విగ్రహానికి వినతి


ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు

జోగిపేట/కొల్చారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పీ.జైపాల్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పాలన, కేటీఆర్ అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బుధవారం జోగిపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. హౌజింగ్ బోర్డు కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నోటికి నల్లగుడ్డలు కట్టుకుని, కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా రూపొందించిన ప్లకార్డులు చేతబూని ప్రధాన రహదారి గుండా అంబేడ్కర్ చౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కాంగ్రెస్ నాయకుల, సీఎం రేవంత్ మనసు మార్చమంటూ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి క్రాంతికిరణ్ ప్రసంగించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను ప్రకటించిన కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి తీరా గెలిచాక వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. హామీలు అమలయ్యే వరకూ ప్రజలు, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పీ.నారాయణ, నాగభూషణం, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు తెలిపారు. బుధవారం కొల్చారం మండలంలో ఆయన మాట్లాడారు.

లక్ష్యం 2.73 లక్షల ఎకరాలు సాగు 38వేల ఎకరాలే!

5వ పేజీ తరువాయి

సాధిస్తామని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

మొదలుకాని పంటల సర్వే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సీజన్‌లో గ్రామాల్లో సర్వే నంబర్లవారీగా సాగు వివరాలు నమోదు చేస్తున్నారు. పంటల వివరాలు, భూముల స్వరూపం, నీటి వనరులు, యంత్రాల వినియోగం, పంటల బీమా, వాణిజ్య పరిస్థితులు.. తదితర వివరాలు తెలుసుకునేందుకు డిజిటల్ పంటల సర్వే నిర్వహిస్తున్నారు. ఈసారి యాసంగి సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా జిల్లాలో పంటల సర్వే ప్రారంభించలేదు. దీనిపై జిల్లా అధికారులు స్పందిస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ నుంచి తమకు ఆదేశాలు రాలేదని, ఆదేశాలు రాగానే సర్వే చేపడతామని చెబుతున్నారు.

వైద్య సేవలు అందుతున్నాయా?

5వ పేజీ తరువాయి

పీహెచ్‌సీ, నందికంది ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆత్మకూర్ పీహెచ్‌సీలను సందర్శించి ఆయా జాతీయ ఆరోగ్య మిషన్ సేవల అమలుపై స్టడీ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంఈ వాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధామాధురి, ఆర్ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్, చీఫ్ డైటీషియన్ బాలస్వామి, హెచ్‌వోడీలు, డాక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాల వినియోగంపై జాగ్రత్తగా ఉండాలి'

సంగారెడ్డి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాల వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని నెహ్రూ యువకేంద్రం(ఎన్‌వైకే) రిసోర్స్ పర్సన్ మురళీ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 'మత్తు పదార్థాల వినియోగం-దుష్పరిణామాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మత్తు పదార్థాల అనర్థాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు శ్రీనివాసరెడ్డి, అనుదీప్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, డా.జగదీశ్వర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మల్లిక పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గానికి సన్మానం

గుమ్మడిదల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం నూతనోత్సాహంతో ముందుకు సాగాలన్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, కోశాధికారి కుంటి రవి ముదిరాజ్, చిరుమని శ్రీనివాసుముదిరాజ్ పాల్గొన్నారు.

గడ్డపోతారంలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం పరిధి సర్వే నెంబరు 10లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం అక్రమ కట్టడాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో పలు కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

'ప్లాస్టిక్‌ను విక్రయిస్తే జరిమానా'

నారాయణఖేడ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, సామగ్రిని విక్రయించినా, వాడుతున్నా జరిమానా తప్పదని మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ ఆదేశాలతో బుధవారం పట్టణంలోని పలు దుకాణాల, వ్యాపార, వాణిజ్య సంస్థలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వస్తు, సామగ్రిని స్వాధీనం చేసుకుని యజమానులకు జరిమానా విధించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని మార్చడం సరికాదు

కోహీర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కోహీర్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామలింగారెడ్డిని మార్చమనడం సరైంది కాదని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కవేలి చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ.. వారిని కాదని కొందరు ఇటీవల పార్టీలోకి వచ్చి పార్టీని డ్యామేజ్ చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్‌ను మండలస్థాయిలో బలోపేతం చేసిన మండల అధ్యక్షుడిని మార్చడం సమంజసం కాదన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా అవుసుల భవానీ


భవానీ

పెద్దశంకరంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలిగా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల భవానీ నియామకమైనట్లు ఆలిండియా కాంగ్రెస్ నాయకురాలు అల్కలాంబ, కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు తెలిపారు. బుధవారం నియామకపత్రాన్ని మెయిల్ ద్వారా అందజేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షురాలిగా నియమించినందుకు పార్టీ నాయకులకు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ పట్లోళ్ల సంజీవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

నర్సాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఎల్లమ్మతల్లికి బోనాలు ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు మల్లికార్జున ఉత్సవాలు నిర్వహించి, ఐదోరోజు ఎల్లమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అందులో భాగంగా యాదవ కుటుంబాలు తమ ఇళ్ల నుంచి బోనాలను శివసత్తుల నృత్యాలు, డోలు చప్పుళ్లతో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉగాది బాలల కథల పోటీ రచనలకు ఆహ్వానం

తూప్రాన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించి, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలన్న ఉద్దేశంతో జిల్లాలో కథలను ఆహ్వానిస్తున్నట్లు అక్షర సేద్యం ఫౌండేషన్ కన్వీనర్ వేల్పుల రాజు పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్‌లో కథల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి కథలు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.750లు, తృతీయ బహుమతి రూ.500, 12 ప్రత్యేక బహుమతులుగా రూ.250లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 97019 33704 నంబరులో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్లకు రూ.45 లక్షలు మంజూరు

పాపన్నపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ఎంపీ రఘునందన్‌రావు పనిచేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు బీ.కొండ రాములు, కిసాన్ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంపీ చొరవతో పాపన్నపేట మండలంలోని తొమ్మిది గ్రామాలకు సీసీరోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామానికి రూ.5 లక్షల చొప్పున మండల పరిధిలోని ముద్దాపూర్, ఆర్కెల, తమ్మాయవల్లి, సీతానగర్, అన్నారం, మల్లంపేట, పాతలింగాయవల్లి, నామాపూర్, గాజులగూడెం గ్రామాలకు మొత్తం రూ.45 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.